# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MAY - 1999

# సంక్షిప్త వార్తలు

కృష్ణా, ఖమ్మం జిల్లాల సువార్తికుల సదస్సు విస్సన్నపేట మండలం రెడ్డిగూడెంలో ఏప్రియల్ 14వ తేదీ బుధవారం అత్యంత ఘనముగా జరిగెను. ఆరోజు ఎండ వేడిమి తీవ్రముగా యున్నను పలు గ్రామములనుండి, పట్టణముల నుండి అనేకమంది సహోదరులు, సహోదరీలు సంతోషముతో రెడ్డిగూడెం క్రీస్తుసంఘ ఆవరణమునందు హాజరుకాగా, "దేవుడున్నాడా ? బైబిలు దేవుని వాక్యమా ?" అను అంశము చర్చించబడెను.

ఉదయకాల సమావేశమునకు సోదరులు సి.హెచ్. కాంతారావ్ (రామచంద్రాపురం) గారు అధ్యక్షత వహించగా, సోదరులు కె.ఇశ్రాయేలు, కె. వసంతరావ్, యమ్. సువర్ణరావ్ గార్లు పాటలు నడిపించిరి. సోదరులు టి. ప్రసాదరావ్ గారు ప్రార్థన చేయగా, టి.చార్లెస్ గారు వాక్య పఠనము గావించిరి. సోదరులు జి.మార్కు (నందిగామ), ఇందుపల్లి ఇశ్రాయేలు (తిరువూరు), కె. ఇశ్రాయేలు (కంభంపాడు), జాషువా గూటం గార్లు ఉదయకాల సమావేశములో చక్కని సందేశములనిచ్చిరి. సోదరులు యమ్.బాబు (రేమిడిచర్ల) గారు బైబిలు పఠనం గావించిన తరువాత, పి.షద్రక్ గారి ప్రార్థనతో ఉదయకాల సమావేశము ముగిసెను.

మధ్యాహ్నకాల సమావేశమునకు సోదరులు టి.ప్రసాదరావ్ (మైలవరం)గారు అధ్యక్షత వహించగా, పి.లాజరు (నూజివీడు), యమ్.బాబు గార్లు ప్రార్థన చేసిరి. సోదరులు ఓర్సు ప్రభుదాస్ (చంద్రాల), ఓర్సు ఆదాము (నూజివీడు), పి.షద్రక్ (గన్నవరం), యన్. ఆదాము (రెడ్డిగూడెం), ఓర్సు ప్రసాదరావ్ (చంద్రాల), టి. ప్రసాదరావ్ (మైలవరం) జాషువా గూటం గార్లు ఇయ్యబడిన అంశముపై చక్కని సందేశములనిచ్చిరి.

దేవుడున్నాడా? అంటేనే ఆయన ఉన్నాడని అర్థమవుతుంది. తండ్రిని తెలిసికోవాలంటే తల్లియే మూలాధారం. ఆలాగే దేవుని తెలిసికోవాలంటే బైబిలే మనకు మూలాధారం. దేవుడున్నాడని ప్రకృతియే సాక్ష్యమిచ్చుచున్నది. "లోకము యెహోవా కృపతో నిండియున్నది. యెహోవా వాక్కుచేత ఆకాశములు కలిగెను" (కీర్తన 115:16). "ఆకాశములు యెహోవా వశము భూమిని ఆయన నరులకిచ్చియున్నాడు" (కీర్తన 115:16). మానవుడైతే నక్షత్రములను లెక్కింపలేడు గాని "నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించియున్నాడు. వాటికన్నిటికి పేరులు పెట్టుచున్నాడు" (కీర్తన 147:4) అని బైబిలు చెప్పుచున్నది.

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 | మే 1999 | సంచిక 10

## సంపాదకీయం

### క్రీస్తుసంఘము యొక్క పునాది, రూపురేఖలు, అభివృద్ధి
(Foundation, Identity and Expansion of the Church of Christ)

పరిచయము : మృతులలో నుండి పునరుత్థానుడైన క్రీస్తే ఆదిమసంఘము యొక్క సందేశమని గత సంచికలో మనము గమనించాము. ఈ పాఠములో సంఘము యొక్క పునాది, రూపురేఖలను గమనించుచు, దానియొక్క అభివృద్ధిని కూడా పరిగణించుదాం.

- రాజ్యము యొక్క ఆగమనమును ప్రవక్తలు ముందుగనే ప్రవచించిరి.

- అది క్రీ॥శ॥ 33వ సంవత్సరములో ఆరంభమాయెను.

- సంఘము, రాజ్యము ఒక్కటే.

సంఘమును గూర్చి దిగువ వాస్తవములు గమనించుము :

- ఎక్లీసియా అనగా పిలువబడినవారు. వారే క్రీస్తుసంఘము. అదొక డినామినేషన్ కాదు.

- మనము ఒక డినామినేషన్‌లోనికి కాదుగాని క్రీస్తులోనికి, ఆయన శరీరము లోనికి బాప్తిస్మము పొందితిమి. మరియు ఆయన రాజ్యమైన సంఘముతో చేర్చబడితిమి.

- ఒకే ఒక్క నిజసంఘమున్నది. మతశాఖలను (డినామినేషన్లను) బైబిలు ఆమోదించుటలేదు (1కొరింథీ 1:10-13).

- సార్వజనికముగా గాని, స్థానికముగా గాని, క్రీస్తు సంఘము ఒక డినామినేషన్ కాదు.

- సంఘము ఒక గుడి(భవనము) కాదు. అది ఆత్మీయమైనది. అట్లయినప్పుడు, దాని పునాది సంగతి యేమిటి ? అని నీవడుగవచ్చును:

## సంఘము యొక్క పునాది

మత్తయి 7:24-27లో యేసు ఇట్లు బోధించెను: "కాబట్టి యీ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు. మరియు యీనా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను. అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను". గనుక బండమీద పునాది వేయబడినవి స్థిరముగా యుండునని మనము గమనించగలము.

మత్తయి 16:18లో యేసు, "ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని నేను మీతో చెప్పు చున్నాను" అని చెప్పెను. దీనిని బట్టి దిగువ సంగతులు సులభముగా గ్రహించు కోగలము :

- సంఘమును కట్టువాడు క్రీస్తే. "నా సంఘమును కట్టుదును" అని ఆయన చెప్పెను.

- క్రీస్తు సంఘము క్రీస్తుకే చెందుతాది, ఆయన సంఘమును కట్టెను. అవి అనేకములు కాదు గాని, ఒక్కటే.

- ఆయన తన సంఘమును కట్టెను. అది క్రీ॥శ॥ 33లో స్థాపించబడినట్లు గత పాఠములలో మనము నేర్చుకొని యున్నాము.

- ఆయన సంఘమే ఆయన రాజ్యము (మత్తయి 16:18-19 చదువుము).

అయితే యేసు చెప్పిన బండ యేమిటి? లేక ఎవరు ? ఆయన ఎవరిని గూర్చి అట్లు చెప్పియున్నారు? ఆయన పేతురును గూర్చి చెప్పియుండవచ్చును. లేదా పేతురు చేసిన ఒప్పుకోలు, "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అను ఒప్పుకోలును గూర్చి చెప్పి యుండవచ్చును.

గనుక అది పేతునును గూర్చి యేసు చెప్పినదైనా యుండాలి, లేదా యేసునుగూర్చి పేతురు చేసిన ఒప్పుకోలు అయినా అయ్యుండాలి. ఆ బండ పేతురే అని చాల మంది భావిస్తారు. అయితే పేతురు అను పదమునకు చిన్నరాయి అని అర్థము. మూల గ్రీకు భాషలో ఆ బండ పేతురు అని సమర్ధించడానికి తావేమీ లేదు. మూల భాషలో పేతురు లేక పెట్రాస్ అను పదము చిన్నరాయి అని అర్థమిచ్చు చున్నది. బండ లేక పెట్రా అను పదమునకు ఒక గొప్ప బండ, కొండంతటి బండయని అర్ధమిచ్చుచున్నది.

గమనిక : యేసు "నీవు పేతురు, (ఒకచిన్నరాయివి). ఈబండ (పెట్రా) మీద నా సంఘమును కట్టుదును" (మత్తయి 16:18) అని చెప్పెను. నా సంఘమును పేతురు (Petras)మీద కట్టుదునని యేసు చెప్పలేదు. ఒక చిన్నరాయి మీదగాక బండ (Petra) మీద కట్టుదునని ఆయన చెప్పెను. "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు చెప్పి గొప్ప పునాది బండవంటి సత్యము మీద యేసు తన సంఘమును నిర్మించెను. గనుక క్రీస్తుసంఘము నైతిక బలహీనతగల మానవునిపై కాదుగాని దేవుని కుమారుని శక్తిపై ఆధారపడి నిర్మించబడినది.

ఈ యభిప్రాయమును సమర్థించు లేఖన భాగములు :

"క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడి యున్నారు" (ఎఫెసీ 2:20). 1పేతురు 2:6ను కూడా చదువుము.

"ప్రభువగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు - సీయోనులో పునాదిగా రాతిని వేసిన వాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి, అమూల్యమైన తలరాయి, బహు స్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28:16).

యేసుప్రభువు ఈ ప్రవచనమును తనకు వర్తింపజేసుకొనెను (మత్త 21:42). అపొస్తలుడైన పేతురు కూడ ఈ ప్రవచనమును యేసుకు వర్తింపజేసెను (అపొ.కా. 4:11).

ముగింపు : "పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని" క్రీస్తు తన సంఘమును గూర్చి చెప్పెను. అవి యింతకు ముందు నిలువలేదు, ఇప్పుడును

నిలువనేరవు. ఎందువలన ? దానిపునాది బండమీద యున్నందువలన (మత్తయి 7:25). ఆ బండ క్రీస్తే. క్రీస్తుసంఘము యొక్క నిజమైన పునాదులు రెండు : క్రీస్తు, బైబిలు.

క్రీస్తుపై గాక వేరొకనిపై లేక వేరొక దానిపై స్థాపించబడిన వాటి సంగతి యేమిటి ? బండమీద పునాది వేయబడలేనిది యిసుకపై పునాది వేసుకొనినదే యని యేసు చెప్పెను.

గమనిక : రోమన్ కేథలిక్కు సంఘము దానికి శిరస్సుగా భావించుకొనుచుండిన పేతురుపై నిలబెట్టబడినది. పోపుల పద్ధతి అంతటికీ పేతురుకే అన్నింటిలో ఘనత అనే సిద్ధాంతము ముఖ్యమైనది. పేతురు తరువాత మేమే అతని ప్రతినిధులం అని చెప్పుకొనే పోపులందరు మత్తయి 16:18 విషయంలో తప్పుడు భావార్థము చెబుతారు. అయితే క్రీస్తుకు బదులు పేతురును పునాదిగా ఎంచుకొనినందున కేథలిక్కుల పద్ధతి అంతయు బైబిలు విరుద్ధమైనదై యిసుక మీద పునాది వేయబడి నట్టిదై యున్నది.

## సంఘము యొక్క రూపురేఖలు

యేసు వాగ్దానము చేసిన సంఘము అపొస్తలుల కాలములో, ఆయన పునరుత్థానుడైన కొద్ది దినములలోనే స్థాపించబడెను. పేతురును, మిగిలిన అపొస్తలులును యేసుప్రభువు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను గూర్చిన వాస్తవములను ప్రకటించగా గొప్ప జన సమూహము వారి మాటలను ఆలకించిరి. అది క్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తుదినము, క్రీ॥శ॥ 33వ సంవత్సరము. ఆనాడు గుమిగూడిన జన సమూహ మంతయు ఈ వాస్తవములను విని కలవరపడిరి (అపో.కా. 2:1-37). వారి వర్తమానము ఎంత బలమైనది, నమ్మకమైనది అంటే ఇంచుమించు మూడువేల మంది స్త్రీ పురుషులు తమ పాపక్షమాపణ నిమిత్తము ఆరోజు బాప్తిస్మము పొందిరి.

(అపొ.కా. 2:38-41). తద్వారా వారు క్రీస్తుచే ఆయన సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:41-47). ఈ రీతిగా క్రీస్తు యొక్క సంఘము ఆరంభమాయెను. బాప్తిస్మము పొందిన వారు క్రీస్తు తన సర్వక్తమిచ్చి సంపాదించిన సంఘ సభ్యులైరి (అపొ.కా. 20:28).

అది క్రీస్తు సంఘమని, అనగా క్రీస్తుచే స్థాపించబడిన సంఘమని పిలువ బడెను. వివిధ ప్రాంతములలో యున్న స్థానిక సంఘములన్నీ "క్రీస్తు సంఘములు" అని పిలువబడెను (రోమా 16:16). సంఘములో యున్నవారు క్రైస్తవులనబడిరి (అపొ.కా. 11:26). క్రీస్తే దానికి శిరస్సై యుండగా సంఘము దైవాధికారము చొప్పున పాలింపబడెను (ఎఫెసీ 1:22-23; 5:23-24). ఆదిమ సంఘము యొక్క ఏకైక విశ్వాస ప్రమాణము క్రీస్తే. మరియు క్రొత్తనిబంధన ఒక్కటి మాత్రమే వారి విశ్వానము యొక్కయు ఆచరణ యొక్కయు మూలాధారము. వారి విశ్వాసము క్రీస్తునందుండెను. ఆయన మాటలే వారి మార్గ దర్శకములు. ప్రతి స్థానిక సంఘము క్రీస్తును తన శిరస్సుగా కలిగి యుండి, తన స్వంత పెద్దలను పరిచారకులను కలిగియుండెను. సంఘమును పోషించి, కాయుటకు పెద్దలు ఏర్పాటు చేయబడిరి (1పేతురు 5:1-3; ఫిలిప్పీ 1:1). పరిచారకులు సంఘ పరిచర్య నిమిత్తము ఏర్పాటు చేయబడిరి.

క్రీస్తు ప్రార్థించిన రీతిగా ఆదిమ సంఘము ఐక్యతగా యుండెను (యోహాను 17:21). వారు ఏకమై యుండవలెనని అపొస్తలులు చేసిన బోధను ఆదిమ సంఘము అనుసరించెను (1కొరింథీ 1:10-13).

క్రీస్తు ప్రార్థించిన రీతిగా ఆదిమ సంఘము ఐక్యతగా యుండెను (యోహాను 17:21). వారు ఏకమై యుండవలెనని అపొస్తలులు చేసిన బోధను ఆదిమ సంఘము అనుసరించెను (1కొరింథీ 1:10-13).

క్రీస్తుసంఘము వాద్యములు లేకుండా పాటలు పాడుచు (ఎఫెసీ 5:19),

క్రీస్తు ద్వారా దేవుని ప్రార్థించుచు (అపొ.కా. 2:42), ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరించుచు (అపొ.కా. 20:7), అదే రోజున కానుకలనిచ్చుచు (1కొరింథీ 16:1-2), దేవుని వాక్యాన్ని ఉపదేశించుచు, బోధించుచు (1తిమో 4:13), ప్రతి ఆదివారమున దేవుని నారాధించేవారు.

క్రీస్తు సంఘసభ్యులు కావలెనంటే విశ్వాసులు తమ పాపముల విషయమై మారుమనస్సు బొంది (లూకా 13:3), క్రీస్తు నామమును మనుష్యులు యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందాలని బోధింపబడిరి (అపొ.కా. 2:38; రోమా 6:4). ఎల్లవేళలా బాప్తిస్మము నీటిలో ముంచడము మాత్రమే (అపొ.కా. 8:38-39, రోమా 6:3-4). ఎవరైతే క్రీస్తునందు విశ్వాసముంచారో, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందారో వారు మాత్రమే బాప్తిస్మము పొందుటకు అర్హులు (అపొ.కా. 2:38; మార్కు 16:16).

## సంఘాభివృద్ధి

సంఘాభివృద్ధి యొక్క నమూనా అపొ.కా. 1:8లో ఇయ్యబడెను: "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు. గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను, భూదింగంతముల వరకును నాకు సాక్షులై యుందురని" యేసుప్రభువు అపొస్తలులతో చెప్పెను. ఈ లేఖన భాగమునుండి మనం రెండు సంగతులను గమనించవచ్చును :

**పరిశుద్ధాత్మ నడిపింపు :** తాను తండ్రియొద్దకు తిరిగి వెళ్లిపోయినప్పుడు ఆదరణ కర్తయైన పరిశుద్ధాత్మను వారికి పంపుదునని క్రీస్తు అపొస్తలులకు వాగ్దానము చేసెను (యోహాను 14:16-18). పరిశుద్ధాత్మ వారికి సమస్తమును బోధించును, యేసు వారితో చెప్పిన సంగతులన్నిటిని వారికి జ్ఞాపకము చేయును

(యోహాను 14:26), మరియు వారిని సర్వసత్యములోనికి నడిపించును (యోహాను 16:13).

అందువలన అపొస్తలులు వారి బోధలోను, వ్రాతలలోను తమ స్వంత అభిప్రాయములను, తలంపులను, ఊహలను గాక పాతనిబంధనలోని దేవుని పరిశుద్ధులవలే "పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" (2పేతురు 1:21).

బైబిలునందున్న నిత్యనడిపింపే క్రైస్తవునికున్న గొప్ప ఆదరణయై యున్నది. సత్యమును కనుగొనుటకు మనము చీకటిలో కొట్టుమిట్టాడాలని ఆయన తలంచలేదు. పరిశుద్ధాత్మ సహాయము వలన దేవుని చిత్తము మనకు బైబిలునందు బయలుపరచబడియున్నది. యిట్టి గొప్ప నిర్ధారణను కలిగి క్రీస్తుయొక్క అపొస్తలులు సువార్త ప్రకటించుటకు బయలు వెళ్లిరి.

- "మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడు చున్నాడే గాని మాటలాడువారు మీరు కారు" (మత్తయి 10:20).
- "మీరేమి చెప్పవలసినదియు పరిశుద్ధాత్మ ఆ గడియలోనే మీకు నేర్పును" అని యేసు తన శిష్యులకు బోధించెను (లూకా 12:12).

మనం జ్ఞాపకముంచుకోవలసినది ఒకటున్నది: క్రొత్తనిబంధన వ్రాయబడక కొన్ని సంవత్సరములకు ముందే సంఘము స్థాపించబడి వ్యాప్తిజెందెను. తరువాత, క్రొత్తనిబంధన పూర్తి అయిన తరువాత ఆదిలో వలే పరిశుద్ధాత్ముడు ప్రత్యేక రీతిగా పనిచేయు విరమించెను. నేడు ఆయన లిఖిత పూర్వకమైన వాక్యము ద్వారా, బైబిలు ద్వారా పనిచేయుచున్నాడు. ఈ అంశమును రాబోయే పాఠాల్లో మరింత విశదముగ పఠించెదము.

9.

**మీరు నాకు సాక్షులై యుందురు** : సువార్త దండయాత్రను గూర్చిన ఆజ్ఞను యేసు తన శిష్యులకు "గొప్ప ఆజ్ఞలో" (The Great Commission) యిచ్చెను. లోకానికంతటికీ సువార్త ప్రకటించుట సంఘ కృషిలో ఒక భాగమై యున్నదని నీవు యిదివరకే నేర్చుకొని యుంటివి. సంఘము నిరాటంకము లేని అభివృద్ధిని సాధించుచుండగా, మనం దానిని మనం ఇప్పుడు గమనించుదాం. మొదట ఉన్న 12మందినుండి అది యెట్లు వ్యాప్తిజెందెనో గమనించుము :

**యెరూషలేములో :**

" కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41).

"వాక్యము వినిని వారిలో అనేకులు నమ్మిరి. వారిలో పురుషుల సంఖ్య యించుమించు అయిదువేలు ఆయెను" (అపొ.కా. 4:4).

"పురుషులును స్త్రీలును అనేకులు మరియెక్కువగ విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి" (అపొ.కా. 5:14).

"ఆ దినములలో శిష్యుల సంఖ్య విస్తరించుచున్నప్పుడు..." (అపొ.కా. 6:1).

"దేవుని వాక్యము ప్రబలమై శిష్యుల సంఖ్య యెరూషలేములో బహుగా విస్తరించెను; మరియు యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి" (అపొ.కా. 6:7).

**యూదయ, సమరయ :**

"ఆకాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింసకలిగినందున అపొస్తలులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరి

పోయిరి..... కాబట్టి చెదరిపోయిన వారు సువార్త వాక్యము ప్రకటించుచు సంచారము చేసిరి" (అపో.కా. 8:1-4).

"అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అపో.కా. 8:12).

"అంతట వారు సాక్ష్యమిచ్చుచు ప్రభువు వాక్యము బోధించి యెరూషలేమునకు తిరిగి వెళ్లుచు, సమరయుల అనేక గ్రామములలో సువార్త ప్రకటించుచు వచ్చిరి" (అపో.కా. 8:25).

"కావున యూదయ గలిలయ సమరయ దేశములందంతట సంఘము క్షేమాభివృద్ధి నొందుచు సమాధానము కలిగియుండెను. మరియు ప్రభువు నందు..... నడుచుకొనుచు విస్తరించుచుండెను" (అపో.కా. 8:31).

"ఇది యొప్పే యందంతట తెలిసినప్పుడు అనేకులు ప్రభువునందు విశ్వసించిరి" (అపో.కా. 9:42).

భూదింగతముల వరకు :

- అంతియొకయలో "బహుజనులు ప్రభువు పక్షమున చేరిరి". "వారు కలిసి యొక సంవత్సరమంతయు సంఘములో ఉండి బహు జనులకు వాక్యము బోధించిరి" (అపో.కా. 11:24,26).
- "దేవుని వాక్యము ప్రబలమై వ్యాపించుచుండెను" (అపో.కా. 12:24).
- అపో.పౌలు మూడు సువార్త దండయాత్రలను చేసెను. అవన్నియు అంతియొకయ నుండియే ఆరంభమాయెను.

- పౌలు బర్నబాలు ఈకొనియలో "యూదుల సమాజమందిరములో ప్రవేశించి తేటగా బోధించినందున అనేకులు, యూదులు గ్రీసు దేశస్థులును విశ్వసించిరి" (అపొ.కా. 14:1).
- "వారిలో కొందరును భక్తిపరులగు గ్రీసు దేశస్థులలో చాలమందియు ఘనత గల స్త్రీలలో అనేకులును ఒప్పుకొని పౌలుతోను, సీలతోను కలిసికొనిరి" (అపొ.కా. 17:4).
- "మరియు కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 18:18).
- "యూదులేమి గ్రీసు దేశస్థులేమి ఆసియాలో కాపురమున్న వారందరును ప్రభువు వాక్యము వినిరి" (అపొ.కా. 19:10).
- "ఇంత ప్రభావముతో ప్రభువు వాక్యము ప్రబలమై వ్యాపించెను" (అపొ.కా. 19:20).

## సంఘాభివృద్ధి యొక్క సారాంశము

"వారి స్వరము భూలోకమందంతటికిని, వారి మాటలు భూదిగంతముల వరకును బయలు వెళ్లను" అని అపొ.పౌలు చెప్పెను (రోమా 10:18). కొలస్సయలోని సంఘమునకు వ్రాయుచు అతడు, "పునాది మీద కట్టబడిన వారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండిన యెడల ఇది మీకు కలుగును. పౌలను నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని" అని వ్రాసెను (కొలస్స 1:23).

యిట్టి వాస్తవములను బట్టి మొదటి శతాబ్దము అంతమగు సరికి రోమా సామ్రాజ్యములో 60 లక్షల మంది నమ్మకమైన క్రైస్తవులుండినట్లు చరిత్ర

చెప్పుచున్నది. క్రీ॥శ॥ 160-220 కాలములో తెర్తుల్లు (Tertullian)ఇట్లు వ్రాసాడు: "మేము నిన్నటి వారమే. అయినను మీ సామ్రాజ్యము, పట్టణములు, పురములు, ద్వీపములు, జాతులు, దండులు, భవంతులు, సభలు, వగయిరాలన్నియు మాతో నిండియున్నవి". మూడవ శతాబ్దపు అంతమునకు రోమా సామ్రాజ్యములో సగముమంది క్రైస్తవులే (Halley. Page 866 ).

గమనిక : పటిష్టమైన పునాదిని (క్రీస్తును) కలిగి, పలుకబడుచున్న వాక్యము వలన పరిశుద్ధాత్మ నడిపింపును బట్టి ఆదిమ క్రైస్తవులు ఈ లోకమును నిజముగా తలక్రిందులు చేసేసిరి (అపొ.కా. 17:6). ఈ యభివృద్ధి వట్టి సంఖ్యలో మాత్రమే కాదు. దేవుని వాక్యము ప్రబలమై విస్తరించెనను మాటలను పలుమారులు నీవు గమనించేయుంటావు. దేవుని వాక్యము ప్రబలమవుటచే శిష్యుల సంఖ్య విస్తరించెను. గనుక సంఖ్యలో వారు విస్తరించారంటే, దేవుని వాక్యము కూడ విస్తరించెనని నిజముగా మనము చెప్పుకొనవచ్చును.

## ప్రకృతి నుండి పాఠములు
## (Lessons from Nature)

దేవుడు తాను సృజించిన విశ్వమును దానిలో సమస్తమును చూచునపుడు అది చాలా మంచిదిగా నుండెనని పలికెను (ఆది.1:31). చిన్న సూక్ష్మజీవియైన వైరస్‌నుండి చాలా పెద్ద జంతువైన డైనోసిరాస్ వరకు, చిన్నబూజు మొక్కనుండి అతి పెద్దదైన ఎర్రచందనం (రెడ్‌వుడ్) వరకు ప్రతిదానిని దాని దాని స్థానము నందుంచెను. అందమైన పూలమొక్కలను, కూరమొక్కలను కాక్టస్‌లాంటి ముండ్ల మొక్కలను వాటి వాటి స్థానమునందుంచెను. ప్రతీది వాటి స్థానమునందుండి వాటి జాతిని అభివృద్ధి చేసికొనుచుండెను. అవును నిజముగా అవి అన్నియు చాల మంచివి. అన్నిటిని మించి మానవునికి వాటిని ఏలుటకు అధికారమిచ్చెను (ఆది. 1:28-30).

13.

## ఈ సృష్టినుండి మనమేమి నేర్చుకొనగలము ?

1 మొదటి విషయమేమనగా విశ్రాంతి :- ఏడవదినమున దేవుడు తన పని అంతటినుండి విశ్రాంతి పొందెను (ఆది.2:1-3). ఈ విధానము సకల పెంపుడు జంతువులకు ఏర్పాటు చేసెను (నిర్గమ 23:12). ఎందుకనగా తన పని అంతటి నుండి విశ్రాంతి కావలెనని దేవునికి తెలియును. ఏడవ సంవత్సరమున భూమికి కూడా విశ్రాంతి నీయవలెను (నిర్గమ 23:10,11). ఈ విధముగా శరీరమునకు, మనస్సుకు ఆత్మకు కూడా విశ్రాంతి అవసరము.

2. ఫలించి అభివృద్ధి చెందుట :- చాలాసార్లు మనము దేవుని కొరకు, మరియు మన ఆత్మీయ క్షేమము కొరకు చాలా పని పెట్టుకొని (busy) యుందుము. మనము నీటి ఓరను నాటబడినదై ఆకువాడక తనకాలమందు ఫలమిచ్చు చెట్టువలె ఉండవలెను (కీర్త 1:2,3). ప్రకృతినుండి నేర్చుకొనవలసిన మరియొక పాఠమేమనగా మనము ఫలించునట్లు (అభివృద్ధి చెందునట్లు) ఆత్మీయ నది ఓరను నాటబడవలసిన అవసరత యున్నది. ఆ నది ఏదనగా లేఖనములు మరియు ప్రార్ధన. దానికి సమయము మరియు సరియైన చోటు కావలెను.

· యేసుక్రీస్తుకు తండ్రియైన దేవునితో సరియైన సమయమును గడుపుటలోని విలువ తెలుసు. ఆ విధముగా ఆ సమయములో మన జీవితములో సేద తీరుటకు, సరియైన నిర్ణయములు తీసికొనుటకు వీలగును (లూకా 6:12, మత్తయి 14:13-21, 23; లూకా 17:1; లూకా 21:37; మార్కు 6:30-32). ఆయన శ్రమ పొందుటకు ముందు గెత్సెమనే తోటలో తన తండ్రితో ఒంటరిగా గడిపెడి అవసరత కలిగియుండెను (లూకా 22:39-46).

3. కొమ్మలు నరకబడు... గల విలువ :- (యోహాను 15:1-8). ప్రకృతిలో పాతవైన వయసు పీ...న ఎ...డిపోయిన ఫలించని పనికిరాని కొమ్మలను తీసిపారవేయవలెను. ఈ విధముగా చేయుట వలన ఆ మొక్క మంచి ఫలములను లేక పువ్వులను ఇచ్చును. మనము పచ్చిక బయలులో గడ్డి కోయుట వలన కలుపు మొలవకుండా సన్నగా పెరుగకుండా చేయుదుము. అదే విధముగా మన ఆత్మీయ జీవితాన్కి కొమ్మలు నరకబడుట అవసరము. పనికిరాని, ఫలించని పాపపు కొమ్మలు నరకనట్లయితే అది నరకబడి అగ్నితో కాల్చబడును. ఆయన నుండి నిత్యరాజ్యములో వేరు చేయబడుటను ఎదుర్కొనకముందే దేవుని చేత దండింపబడుట చాలా మంచిది (హెబ్రీ 12:5-11). మనము కూడా సులువుగా చిక్కులు పెట్టు పాపమును విడిచిపెట్టి మన ఎదుట యుంచబడిన పందెములో పరుగెత్తుదము (హెబ్రీ 12:1,2).

4. ప్రకృతినుండి మనము నేర్చుకొనవలసిన పాఠము దేనిని గూర్చి చింతించకుడి: మత్తయి 6:25-34లో దేవుడు ఈలాగు చెప్పుచున్నాడు : పక్షులను అడవి జంతువులను ఆయన పోషించుచున్నాడు., మనము వాటికంటే శ్రేష్టమైన వారము కనుక ఆయన మనలను పోషించును. శాంతముగా యున్న ఆత్మను చింత దోచుకొనును. చింత మన ఎత్తును ఎక్కువ చేయదు. అడవి పూవులు ఏలాగు ఎదుగుచున్నవో చూడుడి. అవి కష్టపడవు ఒడకవు అయినను సమస్త వైభవముతో కూడిన సొలోమోను సహితము వీటిలో ఒకదానివలె అలంకరింపబడలేదు. ఇవన్నియు భౌతిక సంబంధమైనవి క్షణికమైనవి. కనుక మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును.

5. సామెతలు 6:6-11లో చీమలను గూర్చి చెప్పబడినది. చీమలు ఎల్లప్పుడు తమ పనిపై అనగా తమకు ఆహారాన్ని సమకూర్చుకొనుటకు బారులు తీరి నడుచుచూ సమాచారమును ఒకదానికొకటి అందించుకొనుచూ, ఏది

అసాధ్యమైనదని తలంచక తమ జీవన విధానాన్ని గడుపుచూ ఎల్లప్పుడూ నిరంతరము పనిచేయును. మనము కూడా మంచి పనులు చేయుటకు వేగిరపడినట్లయిన మనము ఆశీర్వదింపబడుదుము మరియు మనకు లేమి కలుగదు. మన జీవితములో చెడ్డవాటినన్నిటిని ప్రక్కన పెట్టి ఆత్మీయ ఆశీర్వాదములు ఇచ్చువానిపై దృష్టినుంచి మన ఆత్మీయ గురి యొద్దకే పరుగెత్తుదము.

6. కోడిని, కోడి పిల్లలను గమనించండి. మత్తయి 23:37 లూకా 13:34 తన పిల్లల ఆహారం కొరకు నేలను గీరుతూ, తన పిల్లలను పిలిచి ఏది మంచి ఆహారమో అది వాటికి నేర్పుతుంది. అపాయము కలిగినపుడు వాటిని తన రెక్కల క్రింద కాపాడుతుంది. ఈవిధముగా యేసు యెరూషలేమును గూర్చి విచారము కలిగియుండెను. ఆయన వారిని రక్షించాలని కోరియున్నాడు. కాని వారు నిరాకరించారు.

మనము కూడా కోడివలె ఒకరినొకరు కాపాడు కొనుచూ ఆత్మీయ ఆహారమును భుజించుటలో ఒకరి ఎడల ఒకరు జాగ్రత్త కల్గియుందము.

మనమందరము గ్రహించుటకు అనేక విషయములను దేవుడు అనుగ్రహించాడు. మనము ప్రకృతినుండి అనేక గొప్ప పాఠములను నేర్చుకొన గలము. ఈరోజునుండే మన పరిసరాలను గమనిస్తూ ప్రతీరోజు నేర్చుకొనుచు ఆశీర్వాదములు పొందుదము.

- ఫిలిప్ షేవుడ్, న్యూజిలాండ్. (VOT)

16.

# అపొ.కా. 2 ఒక గొప్ప అధ్యాయము
## (Acts2, a Great Chapter)

అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో యేసు ఏర్పరచుకొనిన అపొస్తలులందరు ఒకచోట కూడియుండుట మనం చూస్తాము. యేసుప్రభువు మూడున్నర సంవత్సరములు బహిరంగ సువార్త సేవచేయుచు దేవుని రాజ్యము ఆసన్నమైనదని ప్రజలు మారుమనస్సు పొందాలని బోధించారు. ఆయన సిలువ వేయబడ్డారు, సమాధిచేయబడి, మూడవ దినమున పునరుత్థానుడై లేచారు.ఆయన నలువది దినముల వరకు వారికగుపడుచు దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, నా వలన వినిన తండ్రి యొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి యని చెప్పారు.

"పెంతకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొకధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడసాగిరి" (అపొ.కా. 2:1-4).

## గొప్పదినము

పెంతెకొస్తను పండుగ దినము ఒక గొప్ప దినము, అది పస్కా తరువాత ఏడు వారముల కొకసారి వచ్చునది. అది ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే వచ్చేది. దాని నాచరించుటకు గాను "ఆ కాలమున ఆకాశము క్రిందనుండు ప్రతి జనములోనుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో కాపుర ముండిరి". అనేక దేశములనుండి లేక ప్రాంతములనుండి వచ్చిన భక్తిగల

యూదులు యెరూషలేములో యుండిరి. ఈ శబ్దము కలుగగా జనులు గుంపులుగా కూడివచ్చి ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో అపొస్తలులు మాటలాడుట విని, ఆశ్చర్యపడిరి. అయితే పేతురు ఆ పదునొకరి అపొస్తలులతో లేచి యేసుక్రీస్తును గూర్చిన మొదటి సువార్త ప్రసంగాన్ని చేసాడు. పేతురు చేసిన ప్రసంగ సారాంశము యిది :

## గొప్ప సువార్త ప్రసంగము

వారు చూచుచు వినుచున్న సంగతులను దేవుడు యోవేలు ప్రవక్త ద్వారా ముందుగానే ప్రవచించాడు. ఆ ప్రవచనముయొక్క నెరవేర్పె యిది. "ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతము లను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి. ఆయనను తనవలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను; యిది మీరే యెరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను" (అపొ.కా. 2:22-24).

దీనిని గూర్చి కూడ దావీదు ప్రవచించాడు. మూల పురుషుడగు దావీదు చనిపోయి సమాధి చేయబడెను; అతని సమాధి నేటివరకు మన మధ్యన ఉన్నది. అతడు ప్రవక్తయై యుండెను గనుక.... క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను. ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము. ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు సిలువవేసిన

యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పి పేతురు గొప్ప సువార్త ప్రసంగాన్ని చేసాడు.

అపొ.కా. 2 ఒక గొప్ప అధ్యాయం. దీనితో క్రైస్తవ యుగం, క్రీస్తురాజ్యం, క్రీస్తుసంఘం ఆరంభమయ్యింది. అదొక గొప్ప దినాన్న, పెంతెకొస్తు పండుగదినాన్న, అంటే వారములో మొదటి దినాన్న ఆరంభమయ్యింది. అంతకుముందు కనీవినీ యెరుగని గొప్ప క్రియను దేవుడు చేసాడు. తన అపొస్తలులు సర్వసత్యములో నడిపింపబడు నిమిత్తం వారికి పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చాడు. క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానముల వాస్తవములను ప్రకటించడానికి గొప్ప సువార్తికులను, అపొస్తలులను ఆయన ఆనాడు సిద్ధపరచాడు. వారందరికీ పరిశుద్ధాత్మ ప్రేరణ యిచ్చాడు. అపొస్తలులు బోధించుచుండగా సువార్తను వినడానికి గొప్ప జన సమూహము, ఆకాశము క్రిందనుండు ప్రతి జనములోనున్న వారు, ఆనాడు అక్కడ సమకూర్చబడ్డారు. యిట్టి వివిధ జాతులనుండి వచ్చిన ప్రజలకు పేతురు ఒక గొప్ప సువార్త ప్రసంగాన్ని చేసాడు. యేసు దేవుని కుమారుడని, వారి రక్షకుడని వారికి ప్రబోధించాడు. ఈ గొప్ప ప్రసంగాన్ని విని, విశ్వసించి వారొక గొప్ప ప్రశ్న వేసారు.

## గొప్ప ప్రశ్న

వారు పేతురు ప్రసంగాన్ని విని హృదయములో నొచ్చుకొని, సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును మిగిలిన అపొస్తలులను అడిగారు. మానవుడు అడుగగలిగిన ప్రశ్నలన్నిటికంటె గొప్పది యిది : రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను? ప్రతి మానవుడు పాపంలోబడి నశించి పోవుచున్నాడు. రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను ? అని ప్రతివాడు అడిగి తెలిసికొనాలి. పెంతెకొస్తు నాడు ప్రజలు ఈ గొప్పప్రశ్న నడుగగా, పేతురు "మీరు మారుమనస్సు పొంది

పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని ఒక గొప్ప జవాబిచ్చాడు.

## గొప్ప జవాబు

పాపియైన మానవుడు రక్షణ పొందాలంటే, యేసుప్రభువును గూర్చిన సువార్తను వినాలి. యేసే దేవుని కుమారుడని విశ్వసించాలి. వినుటవలన విశ్వాసము కలుగునని రోమా 10:17 చెప్పుచున్నది. నేను ఆయనననని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసింపనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోదురని యేసు యోహాను 8:24లో చెప్పాడు. ఇక్కడ పెంతెకొస్తునాడు ప్రజలు క్రీస్తు సువార్తను విన్నారు; పేతురు చెప్పినది సత్యమని గ్రహించారు, వారి మనస్సులో నొచ్చుకొన్నారు, అంటే విశ్వసించారు. క్రీస్తు సువార్తను విశ్వసించిన వీరు రక్షణ పొందుటకు ఏమి చేయవలనని అడుగగా వారు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని జవాబీయబడింది. రక్షింపబడుటకు మారుమనస్సు అవుసరమని యేసుప్రభువు బోధించారు. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురని" ఆయన లూకా 13:5లో చెప్పారు. పెంతెకొస్తు నాటి ప్రజలు మారుమనస్సు పొందారు. పేతురు ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి-మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించాడు. అతడు చేసిన గొప్ప ప్రసంగానికి గొప్ప ఫలితం కనబడింది. "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి".

పాపులైన మానవులు రక్షణ పొందుటకు ఏమి చేయవలెనని అడిగిన గొప్ప ప్రశ్నకు జవాబీయబడింది. మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుడి. ఈ యాజ్ఞకు లోబడిన ప్రజల సంఖ్య కూడ గొప్పది-ఇంచుమించు మూడువేలు. నమ్మి

బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని ప్రభువు మార్కు 16:16లో చెప్పారు. పెంతెకొస్తునాడు ప్రజలు యేసునందు నమ్మారు, మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందారు, రక్షింపబడ్డారు. "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న ప్రతివారిని అనుదినము వారితో చేర్చుచుండెను" అని అపొ.కా. 2:47లో వ్రాయబడి యున్నది. పెంతెకొస్తునుండి నేటివరకు రక్షింపబడుచున్న వారిని ప్రభువు అనుదినము తన సంఘముతో చేర్చుచుండెను. అదొక గొప్ప సంస్థ. అది క్రీస్తుసంఘము, దానిలోనికి మనకు మనమే చేరలేము. దానితో చేర్చేవాడు ఆయనే. నీవు కూడా క్రీస్తుసంఘంలో క్రీస్తుచే చేర్చబడాలని కోరుచున్న యెడల యేసుప్రభువు నందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుము. రక్షింపబడుము. క్రీస్తుసంఘములో ప్రభువుచే చేర్చ బడుము.

-జాషువా గూటం.

## శారా
## (Sarah- Wife of the World's Most Honoured Man)

ఈ ప్రపంచములో అబ్రాహాము కున్నంత గౌరవము మరి యెవ్వరికిని లేదు. అతడు క్రీస్తుప్రభువు కంటె ఉన్నతమైన వ్యక్తి అని కాదుగాని క్రీస్తును నిరాకరించిన వారెందరో అబ్రాహాము యెడల ఎక్కువైన గౌరవము కలిగియున్నారు. క్రైస్తవులు, యూదులు, మహమ్మదీయులు అబ్రాహామును తమ తండ్రిగా గౌరవిస్తారు. క్రైస్తవులు అబ్రాహామును తమకు ఆత్మీయ తండ్రిగాను (గలతీ 3:29), యూదులు తమ జనాంగమునకు మూలపురుషునిగను, మహమ్మదీయులు అబ్రాహాము కుమారుడైన ఇష్మాయేలు సంతానముగను గౌరవిస్తారు. కనుక శతాబ్దములనుండి యింత గొప్ప గౌరవమును పొందిన వ్యక్తి అబ్రాహాము మాత్రమే. అట్టి గొప్ప వ్యక్తిత్వముగల అబ్రాహాముకు భార్యగా యుండుటకు శారాకు ఆధిక్యత కలిగింది.

"విగ్రహారాధనతో నిండిన కల్దీయుల ఊరను పట్టణములో అబ్రాహాము, శారాలు నివసించుచుండిరి. అబ్రాహాము తండ్రియైన తెరహు విగ్రహారాధికుడై నప్పటికిని అబ్రాహాము పరలోకమందలి దేవునియందు విశ్వాసముతో జీవించుచుండెను. అందుచే యెహోవా దేవుడు ఊరు పట్టణమును విడచి ఆయన చూపించబోయే దేశమునకు వెళ్ళుమని అబ్రాహాముతో చెప్పెను (ఆది.కా. 12:13). యెహోవా దేవుని నాయకత్వముతో అబ్రాహాము, శారాలు కనానుకు యాత్రను సాగించిరి.

తన భర్తయైన అబ్రాహాము వెంట తెలియని దేశమునకు, తెలియని ప్రజల మధ్యకు శారా వెళ్ళుటకంగీకరించుట ద్వారా దేవునియెడల ఆమెకున్న విశ్వాసమును, ఆయన మాటయెడల ఆమె చూపిన విధేయతను బట్టి దేవుడామెను విశ్వాసముగల స్త్రీలలో మొదటి స్త్రీగా ఎంచెను. హవ్వవలె దేవుని యాజ్ఞను ధిక్కరించుటకు తన భర్తను ప్రోత్సహించలేదు; లేక దేవుని యాజ్ఞను పాటించుటలో యోబు చూపిన విధేయతను తన భార్య నిరుత్సాహపరచినట్లు అబ్రాహామును శారా నిరుత్సాహ పరచలేదు. ఆమెకు దేవుని యెడల గల విశ్వాసమును బట్టియే తాను వయస్సు గతించినదైనను గర్భమును ధరించుటకు శక్తిని పొందెను (హెబ్రీ 11:11).

విశ్వాసమనగా యేమిటి? వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును (రోమా 10:17). కనుక విశ్వాసమనగా యెహోవా దేవుని మాటలను విని, వాటికి విధేయులమై జీవించుటయే. ఆయన వాగ్దానములను మనము హృదయపూర్వకముగ నమ్మినట్లయిన మనకు నెమ్మది, సమాధానము కలుగును. ప్రభువైన యేసు దేవుని కుమారుడని మనము విశ్వసించాలి (యోహాను 8:24). అబ్రాహాము శారాలు దేవుని మాటకు విధేయులై విగ్రహారాధనతో నిండిన జనాంగము మధ్యనుండి దేవుడు చూపించబోయే దేశమునకు బయలుదేరిరి (2కొరింథీ 6:17-18).

క్రొత్త నిబంధనలో శారాను గూర్చి రెండువిషయాలు ప్రాముఖ్యముగ చెప్పబడినవి. (1) శారాకు దేవుని యందలి విశ్వాసము **(2)** తన భర్తయైన అబ్రాహాము యెడల ఆమెకు గల విధేయత. ఈ రెండు విషయాలు అన్ని కాలముల లోను, అన్ని వయస్సులయందు గల స్త్రీలు అనుసరింపదగినవి. స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడి యుండుడి .... పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును తమ స్వపురుషులకు లోబడియుండుటచేత తమ్మునుతాము అలంకరించుకొనిరి. ఆ ప్రకారము శారా అబ్రాహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడి యుండెను. మీరును యోగ్యముగా నడచుకొనుచు ఏ భయము నకు బెదరక యున్నయెడల ఆమెకు పిల్లలగుదురు. స్త్రీ పురుషునికి సహాయకు రాలిగా యుండుటకు నిర్మించబడెను గాని అతనిమీద అధికారము చేయుటకు నిర్మించబడలేదు (1పేతురు 3:1-6).

శారా ఎంత విశ్వాసముగలదైనను పరిపూర్ణత లోనికి రాలేదు. కరువు భారమును బట్టి వారు ఐగుప్తునకు వెళ్ళవలసి వచ్చినపుడు ఆమెయొక్క సౌందర్యమును బట్టి శారాను బ్రతుకనిచ్చి అబ్రాహామును చంపుదురనెడి భయముచేత ఆమె తన సోదరియని రాజైన అబీమెలెకునకు చెప్పుట ద్వారా అబ్రాహాము అబద్ధమాడి ఆ రాజును మోసగించెను (ఆది.కా. 12:10-20). భయము పాపము చేయుటకు వారిని నడిపించెను. యేసును సిలువవేయు సమయములో ఆయన శిష్యులు కూడ భయపడి ఆయనను తాత్కాలికముగా విడచి పారిపోయిరి. ఆ తరువాత వారు ధైర్యపడి ప్రభువైన యేసుకొరకు చనిపోవుట మిక్కిలి శ్రేష్ఠమైన విషయముగ ఎంచుకొనిరి.

కుమారుని పొందవలెననెడి అత్యాశచే శారాయొక్క విశ్వాసము సన్నగిల్లెను. శారా చాలసౌందర్యవతి ధనికురాలు, ఘనుడైన పురుషునికి భార్య, భర్తచే యెక్కువగ ప్రేమింపబడ[illegible]ది. అయిన్పటికిని ఆమె గొడ్రాలైనందువలన ఆమెలో సంత[illegible] లేదు. [illegible]ని సంతానమును విస్తరింపచేయుదుననెడి వాగ్దానమును

అబ్రాహాము దేవునినుండి పొందినప్పటికిని శారాయొక్క అవిశ్వాసము బట్టి తన దాసియైన హాగరును అబ్రాహాముకు భార్యగయిచ్చి ఆమె ద్వారా సంతానమును పొందవచ్చుననెడి తలంపు శారాకుకలిగెను. ఇష్మాయేలును హాగరు కనిన తరువాత శారా హాగరుల మధ్య గొప్ప తొందర కలిగి వారు కలసి నివసింపలేక హాగరుతన కుమారుడైన ఇష్మాయేలుతో అరణ్యమునకు పారిపోయెను (ఆది.కా. 16:1-6).

ముగ్గురు దేవదూతలు అబ్రాహాము దగ్గరకు వచ్చి నీ భార్యయైన శారా నీకు ఒక కుమారుని కనునని చెప్పిన మాటలు శారా వినినప్పుడు కూడ ఆమె కొంత సందేహించెను (ఆది.కా. 18:9-15). ఆమె తన వయస్సును బట్టి సందేహించి ఆమె అవిశ్వాసమును తెలియ జేయునట్టి నవ్వును నవ్వెను. దేవుని వాగ్దానములను శారా విస్మరించినదే కాని దేవునికి అసాధ్యమైన కార్యమేదియును లేదనెడి భావన ఆమెలో లేకపోయెను. అందుచే దూత ఆమెను. గద్దించెను. శారా యొక్క సందేహములన్నియు సమసిపోవు కాలము సమీపించెను. యెహోవాకు అసాధ్యమైన దేదైనా గలదా ? నిర్ణయింపబడిన సమయమునకు శారా గర్భవతి యాయెను.

అబ్రాహాము శారాలు ఆతిధ్యమిచ్చుటలో శ్రేష్టులు. వారు తెలియకయే దేవదూతలకు ఆతిధ్యమిచ్చారు (హెబ్రీ 13:2). సణగుకొనకుండ ఒకనికి ఒకడు ఆతిధ్యము చేయుడి (1పేతు 4:9). పరిశుద్ధుల అవసరములలో పాలు పొందుచు, ఆతిధ్యమిచ్చు చుండుడి (రోమా 12:13). ఆతిధ్యమిచ్చుటలో స్త్రీలయొక్క శ్రద్ధగ బాధ్యత యెక్కువగా యున్నది. ఆతిధ్యమిచ్చుట యనేది దేవుడిచ్చిన ఆజ్ఞయైనప్పటికిని ప్రస్తుత దినములలో ఇది యెక్కువగా నిర్లక్ష్యము చేయబడు చున్నది. నీవు ఆశీర్వాదముగ యుందువని దేవుడు అబ్రాహాముకు వాగ్దా... చేసెను (ఆది.కా. 12:2). అబ్రాహాము శారాల విశ్వాసమును బట్టి దేవుడు వా... గొప్ప ఆశీర్వాదముల నిచ్చెను.

శారా ఇస్సాకును కనుట ద్వారా గొప్ప ఘనత పొందెను. ఇస్సాకు

వంశములోనుండియే క్రీస్తు ప్రభువు జన్మించెను. అందునుబట్టి ఈ భూలోకము ఆశీర్వాదమును పొందెను. వయస్సు మించినట్టివారు దేవునికి కావాలి. నెరసిన వెండ్రుకలు సొగసైన కిరీటము (సామె 16:31). అవి నీతి ప్రవర్తన కలవానికి కలిగి యుండును. పెద్దవారందరు తెలివైనవారు కారని మనము ఏలీహును బట్టి గ్రహించ గలము (యోబు 32:4-9). కాలేబు విషయము చూచినట్లయితే ఎనుబదియైదు సంవత్సరముల వయస్సుండినప్పటికిని కష్టసాధ్యమైన ప్రదేశమును తనకు స్వాస్థ్యముగా యిమ్మని అడుగుచున్నాడు. కాలేబువలె ధైర్యముతో, ఓర్పుతో దేవుని కొరకు కావాలి. వయస్సులో పెద్ద వారైనట్టి వారు సాధారణంగా మంచి అనుభవం గలవారైయుండి చిన్నలకు తగు సలహాలు యివ్వగలరు. మంచి మార్గములో నడిపించువారై యుండగలరు. ప్రపంచములో కొన్ని ఘనమైన కార్యాలు చేయగలిగి నటువంటివారు పెద్దవారే. చిన్నలకు లేనట్టి ఓర్పు పెద్దవారిలో యుంటుంది. కనుక అటువంటి పెద్దవారే దేవునికి కావాలి.

దేవుని చిత్తమును నెరవేర్చుటకు ప్రభువైన యేసు ఈ లోకములోనికి వచ్చెను. ఆయన రాక మునుపు మోషే ధర్మశాస్త్రము విగ్రహారాధికులైన జనాంగము లకు దేవుని గూర్చిన జ్ఞానము కలిగించుటలో ఒక ఉపాధ్యాయుని వలె పనిచేసింది. ప్రభువైన క్రీస్తు ధర్మశాస్త్రమంతటిని నెరవేర్చి దానిని సిలువకు కొట్టెను గనుక మనము ధర్మశాస్త్రమునకు బాధ్యులము గాక ప్రభువైన యేసు చిత్తానుసారముగ జీవింప బద్ధులమై యున్నాము.

- లోటీ బెత్ హాబ్స్.

- 0 -

దేవుడు ప్రకృతి ద్వారాను, బైబిలు ద్వారాను, యేసుక్రీస్తులో వ్యక్తిగతముగాను మానవులకు తన్నుతాను బయలు పరచుకొనియున్నాడు. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచు చున్నది" (కీర్తన 19:1). "దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమై యున్నది; దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి" (రోమా 1:19-20).

ప్రకృతికి కర్తయైన దేవుడే బైబిలు యొక్క గ్రంధకర్తయై యున్నాడు. ప్రకృతిలో మనకు గ్రాహ్యము కాని సంగతులెట్లున్నవో, బైబిలులో కూడా అట్లే యున్నవి. దేవుడున్నాడని మానవుని మనస్సాక్షియే ఎల్లప్పుడు అతనికి చెబుతుంది (రోమా 2:14-15). ఇహలోకము నుండి పరలోకమునకు మార్గము చూపు మార్గదర్శి బైబిలు మాత్రమే. అది చారిత్రకముగాను, భౌగోళికముగాను, విజ్ఞా శాస్త్రయుక్తము గాను యదార్థమైనది. మానవులందరకు ఒక్కడే దేవుడెట్లున్నాడో, అట్లే అన్ని జాతులవారికి, అన్ని బాషల వారికీ ఒక్కటే బైబిలు ఉన్నది. అది దేవుని వాక్యం, దానిని విని విశ్వసించి, దానికి లోబడినవారు రక్షింపబడ్తారు; వినేవాళ్లని వారు శిక్షింపబడ్తారు అని సహోదరులు హెచ్చరించిరి.

ఈ సువార్తికుల సదస్సు కొరకు రెడ్డిగూడెంలోని స్థానిక సంఘము, కన్వీనర్ . ఓర్సు నాగేశ్వరరావ్ గారు, స్థానిక సువార్తికులు యమ్. సువర్ణరావ్ గార్లు చక్కని ఏర్పాట్లు చేసారు. వచ్చినవారికి మంచి రుచికరమైన, శుచికరమైన భోజన పానాదుల నేర్పాటు చేసిరి. సోదరులు ఓర్సు నాగేశ్వరరావ్ గారు వందన సమర్పణచేసి స్థానిక సంఘ కార్యక్రమములను వివరించగా, సోదరులు కాంతారావ్ గారి ప్రార్ధనతో సదస్సు సాయంకాలము ముగించబడెను. రాత్రివేళ స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో గొప్ప బహిరంగ సువార్త కూటము ఏర్పాటు చేయబడెను. దానిలో ఓర్సు ఆదాము, టి. ప్రసాదరావ్, జి. మార్కు, సి.హెచ్. కాంతారావ్, జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. వందలాది ప్రజలు హాజరై దేవుని వాక్యమును సంతోషముతో ఆలకించిరి. సోదరులు ఓర్సు ప్రసాదరావ్ గారి ప్రార్ధనతో రాత్రి 11 గంటలకు సువార్త కూటము ముగిసెను.

సువార్త సదస్సు మధ్యాహ్న భోజన విరామ సమయంలో సోదరులు జాషువా గారు, ఇందుపల్లి ఇశ్రాయేలు గారు తదితర్లు పుట్రేల గ్రామము వెళ్లి అక్కడ

నిర్మించబడిన క్రీస్తు సంఘ ప్రార్థన మందిరమును రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠ చేసి క్లుప్తముగా వాక్యపరిచర్య చేసిరి. రెడ్డిగూడెం, పుద్రేల స్థానిక సంఘములు మరింత అభివృద్ధి జెందునట్లు ప్రార్థించుదాం.

ఏప్రియల్ 22,23,24 తేదీలలో రాజానగరం మండలంలో యున్న శ్రీకృష్ణ పట్నంలో సువార్త కూటములను అక్కడ స్థానిక సంఘము నిర్వహించెను. ఆ కూటములలో సోదరులు టి.వి.యస్. కుమార్, జాషువాగూటం, యం.కిరణ్‌కుమార్ గార్లు వాక్యపరిచర్య చేసిరి. ఒకామె క్రీస్తులోనికి బాప్తిస్మము పొందెను. అక్కడ పి.సైమన్ గారు సువార్తికునిగా పనిచేయుచున్నారు.

ఏప్రియల్ 25వ తేదీ ఆదివారం రాత్రి ఆచంట మండలం పెళ్లికూతురమ్మ చెర్వు గ్రామంలో జరిగిన బహిరంగ సభలో సోదరులు జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. పరిసరప్రాంతములలోని పలువురు సువార్తికులు ఆ కూటములో పాలుపొందిరి. ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ సోదరులు పి.సామ్యేలు గారు వాక్య పరిచర్య గావించుచున్నారు.

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004.
Editor : Joshua Gootam

RNI Regd. No. 69973/98
PRINTED BOOK - BOOK POST

From:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To